# సిద్ధార్థా! వగపెందుకు?

- డా. వి. చంద్రశేఖరరావు

వారం తిరక్కుండానే ఆమె తనదైన జీవితపు హడావుడితో ప్రత్యక్షంకావడం నేను జీర్ణించుకోలేక పోయాను. ఎప్పటిలాగే తన రచనా వ్యాసంగం, కవితలు, కథలు, కరపత్రాలు, గుంపులు గుంపులుగా "క్షణాల్లో ప్రపంచాన్ని ఉద్ధరించగలమనుకునే" ఆమె తరహా మనుషులు, వాళ్ళతో చర్చలు, ఆమెకెట్లా సాధ్యం కాగలిగిందో నాకంతుపట్టనేలేదు.

నాకైతే కదిలినా, మెదిలినా నాన్న జ్ఞాపకాలే. హఠాత్తుగా రెండేళ్ళ పసివాడినై ఆయన బొజ్జపై పడుకొని మారాం చేసిన రోజులు గుర్తుకొస్తాయి. చేతిలో చెయ్యి వేసుకొని ఇద్దరం ఫుట్‌బాల్ గ్రౌండులో పచార్లుచేసిన క్షణాలు గుర్తుకొస్తాయి. సాయంకాలపు వేళ, అట్లా బజారువైపు వెళ్ళి, బజ్జీలో, పునుగులో కొనుక్కొని తింటూ, ఎదురుగా వున్న సంగీత్ సినిమాహాల్లో ఏ ఇంగ్లీషు సినిమానో చూసి రాత్రి తొమ్మిదింటికి ఇంటికి చేరితే "మీరిద్దరూ తండ్రీ కొడుకులా? స్నేహితులా?" అంటూ ఆమె మమ్మల్ని విసుక్కోవడం గుర్తుకొస్తుంది. ఐదింటికి ట్రాక్ సూట్‌లో గ్రౌండ్‌కు వెళ్ళి, ఫుట్‌బాల్ ఆట అనే ఐంద్రజాలిక స్వప్న ప్రపంచంలో ఏడు ఎనిమిది దాకా గడిపిన ఉదయాలు ఇంకా వెంటాడుతూనే వున్నాయి. రాత్రి తొమ్మిది దాటినా ఇంటికి రాని ఆమె గురించి మేము కోపంతో, విసుగుతో చెప్పుకునే జోకులు నాకింకా గుర్తున్నాయి. ఆయన నాకు నాన్న మాత్రమే కాదు అమ్మ కూడా. ఏ రాత్రివేళో మెలుకువ వచ్చి వాళ్ళ గదిలోకి వెళ్ళి, ఆయన పక్కనే, ఆయనపై చేతులువేసి పడుకోవడం, ఆయన నన్ను దగ్గరకు లాక్కోవడం, "యూ ఆర్ స్పాయిలింగ్ దికిడ్!" అనే ఆమె విసురు మధ్య నన్నింకా గట్టిగా తనవైపుకు అదుముకునే ఆయన మెత్తని స్పర్శ ఇంకా వెచ్చ వెచ్చగా నాకు తగుల్తూనే వుంది.

"నాకు సెంటిమెంట్లంటే అసహ్యం! ఆయన చనిపోవటం మనకు పెద్దలోటు. అది మనం తట్టుకోలేని దెబ్బ. అట్లా అని రోజుల తరబడి దుఃఖిస్తూ కూర్చో లేము కదా! ఆయనతోపాటు మన జీవితాలు ఇక్కడితో ముగిసి పోవడం లేదు కదా! ఇట్లా ఇంట్లోనే కూర్చోవటం, మాటి మాటికీ కళ్ళు తుడుచుకోవడం. ఈ సంతాపవ్రతం, ఇదంతా నాకు విసుగ్గా వుంది. జీవితమంటే దుఃఖం మాత్రమేనా?"

మొదటి నుంచీ ఆమె ధోరణి యింతే. అనుభూతులు, స్పందనలులేని ముడి పదార్థంలా ప్రవర్తిస్తుంది. వాళ్ళిద్దరిదీ ప్రేమ వివాహమని నాన్న చెబుతుంటే నాకు ఆశ్చర్యం వేసేది. ప్రేమలాంటి మృదువైన విషయాలు ఆ మనిషి ఎరుగునా అని నా అనుమానం. "మధుమేహం, గుండె పోటులతో ఆయన పోయాడని డాక్టర్లంటారు కానీ, ఆమె నిర్లక్ష్యమే ఆయన ప్రాణాల్ని కొద్ది కొద్దిగా తీసింది!" అంటూ నాన్నతోపాటు పనిచేసే లెక్చరర్లు అనుకోవడం అబద్ధం కాదేమో?

దుఃఖంవస్తే గొల్లుమని ఏడ్చే వయసుదాటి, ముఖంపైన ఒక కృత్రిమమైన గంభీరపు తొడుగుతో బ్రతకాల్సిన వయసు నాది. అందునా కసితీరా ఏడ్చుకోవటం, జ్ఞాపకాల వత్తిడితో కళ్ళు తుడుచుకోవటం లాంటివి అమ్మాయిలు మాత్రమే చేస్తారని బోధించే ప్రపంచంలో పదహారేళ్ళ కుర్రవాణ్ణి. ఏ రాత్రిపూటో మెలుకువ వచ్చి అట్లా నాన్న పుస్తకాల షెల్ఫువైపు వెళ్ళి ఆ పుస్తకాల్ని తడుముతూ, ఆ పేజీల మధ్య వేళ్ళు జొనిపి, ఆయన మెత్తని చేతుల్ని స్పృశించినట్లనిపించి, చీకట్లో అట్లాగే బెక్కు, బెక్కు మంటూ ఏడవటం తప్ప, ఆవిడ తన లెక్చర్‌నోట్సు, పుస్తకాలు, లంచ్ డబ్బాతో కాలేజీకి వెళ్ళినాక, ఇల్లంతా ఉన్మాదిలా తిరుగుతూ, బాల్కనీలో మేమిద్దరం ఎదురెదురుగా కూర్చుని ముచ్చట్లు చెప్పకున్న క్షణాల్ని గుర్తుతెచ్చుకొని, లేదా మేడమెట్లపై కూలబడి ఆయన బాల్యయవ్వనాల్ని తవ్వుకుంటూ గడిపిన సాయంకాలాల్ని గుర్తు తెచ్చుకోవడమో లేదా నా రూమ్ పాదవునా వున్న ఆయన కొనిచ్చిన కానుకల వెనుకనున్న ఫ్లాష్‌బాక్‌లు తలుచుకుని, తడితడి అయిన కళ్ళ సాక్షిగా ఆయనను పోగొట్టుకొన్నాననే వాస్తవానికీ, ఆయన కావాలనే కోరికకీ మధ్య పెనుగులాటగా గడిపిన నెలరోజుల తరువాత మొదటిసారిగా కాలేజీకి బయల్దేరినపుడు "సో! నెలరోజుల ఇంక్యుబేషన్ పిరియడ్ తీసుకొన్నావన్నమాట!" అని ఆమె అంటుంటే, నీళ్ళు చిప్పిలుతున్న కళ్ళతో "నువ్వు నా తల్లివేనా? ఆ పోయింది నీ మొగుడేనా?" అంటూ ఏడుపుతో జీరబోయిన పెనుగొంతుతో అన్న నా మాటలు, ఆ వేళంతా పశ్చాత్తాపంతో నన్ను వెంటాడాయి గానీ, ఆవిడ ముఖంలో మాత్రం రవ్వంత కదలిక కూడా లేదు.

"అమ్మకు నేనంటే ఎందుకు ఇష్టం లేదు?" అనే ప్రశ్నతోనే నా బాల్యమంతా గడిచిపోయింది. "బహుశా నేను ఆవిడ సొంత కొడుకును కాదేమో? ఎక్కడన్నా దొరికి వుంటానేమో?" అనే సమాధానం నాకు ఊరట నిచ్చేది. ఆ మాటే అంటే నాన్న పెద్ద పెట్టున నవ్వేవాడు. "మీ అమ్మ కొత్తతరం స్త్రీకి ప్రతినిధి. మమకారం, ప్రేమ, నాది అనే పాశం, ఇవన్నీ స్త్రీలకు సమాజం తగిలించిన సంకెళ్ళని తన నమ్మకం. స్త్రీలేకాదు, అసలు మనుషులెవరూ అంత ఎమోషనల్‌గా వుండనవసరం లేదని ఆమె వాదన. ఇంకా రెండు మూడేళ్ళు ఆగి, భాష మీద పట్టు వచ్చినాక, ఆమె నవలలు, కథలు చదువు. ఆమె ఇంకా బాగా అర్థమవుతుంది." అనేవాడు. నాన్న, అమ్మ ప్రవర్తనను సమర్థించేవాడో లేదో గానీ, నాకు మాత్రం అమ్మంటే అయిష్టం, పరాయితనం ఏర్పడ్డాయి.

నాన్న చనిపోయిన తరువాత మా యింట్లో ఓ సంస్మరణమో, సంతాప సభలో జరగక పోవడం నాకెందుకో పెద్ద లోటుగా అనిపించింది. ఆయన చిన్నతనంలోనే వాళ్ళ అమ్మ పోయింది. తాతయ్య కూడా పోయాడు. ఆయన బంధు ప్రపంచపు అవశేషాలమంటూ ఇద్దరు, ముగ్గురు వచ్చారు గానీ, వాళ్ళలో దుఃఖపు ఛాయ రవంత కూడా లేదు. ఫలానా చోట ఒక అర ఎకరం పొలం వుంది. ఆ పల్లెటూరులో పాడుబడ్డ మిద్దె వుంది, మాకిచ్చివేస్తే ఆయన పేరు చెప్పకు బ్రతుకుతామంటూ నసపెట్టారు వున్న ఆ రెండు రోజులు. కాలేజీలో సంతాప సభ జరిగింది. గానీ, అదంతా ఓ నాటకీయమైన రిట్యుయల్. కొద్దిగా దిగులును అభినయిస్తారు. కాసిన్ని జ్ఞాపకాల్ని కుప్పబోస్తారు. అదంతా ఏళ్ళ తరబడిగా ప్రదర్శిస్తున్న నాటకంలా వుంటుంది. ఆ కాసిన్ని నిముషాల సంతాప సభ అయిపోయినాక కాసేపట్లోనే ఓ పేకాట సమూహంగానో, ఓ నూన్‌షో గుంపుగానో మారిపోతారు.

నాకైతే ఎందుకో చాలా మంది ఆయన స్నేహితులో, ఆత్మీయులో అందర్నీ ఒక చోటకు చేర్చి ఆయన స్మృతుల్లో తడిసి, ఆయన లేకపోవటం అనే లోటును సామూహికంగా పంచుకొని, ఒకరి కొకరు ఓదార్చుకొని - అట్లాంటి దేదయినా ఒక సంఘటన జరిగితే బాగుండు అనే కోరిక వుంది.

"ఇదంతా బూటకం. ఒకడి దుఃఖపు బరువు ఇంకొకడు మోసే అంత దగ్గరితనం మనుషుల మధ్య యివ్వుడు లేదు. అసలీ డిపెండబిలిటీ నాకు నచ్చదు. నీకు నువ్వే ఓదార్పు, ఆసరా కావాలి! నీకు నువ్వే చిగుర్చాలి. ఈ రిట్యుయల్‌కి ఖర్చు పెట్టే ఈ పేదో, ఇరవయ్యో వేలు రేపు నీ చదువుకో, భవిష్యత్తుకో ఉపయోగపడతాయి" అని మాట్లాడే ఆమెతో నేనేమి వాదించగలను.

కాలేజీలో ఇద్దరు ముగ్గురు స్నేహితులు మాత్రం సానుభూతి వచనాలు చెప్పారు. అంతకు మించి పెద్ద మార్పేమీ లేదు. క్లాసు రూము, పాఠాలు, మధ్య మధ్యలో క్యాంటీన్‌కి వెళ్ళడం, లేడీస్టూడెంట్లు తటస్థపడితే చూపులకు తళుకుల్ని అద్దటాలు, లెక్చరర్లపై చౌకబారు జోకులు, నాగార్జున, నగ్మాల రొమాన్సుపై గంటల తరబడి గాసిప్‌లు, రోజూ చూసేతంతే. ఇదంతా ఎంతో ఉత్సాహ భరితంగా ఇది వరకు నాకెందుకు అనిపించేదో అర్థంకాలేదు. ఈ పరిసరాల నుంచి పారిపోయి ఏదైనా అజ్ఞాత ప్రపంచంలో సంచరించాలనే కోరిక నన్ను వివశుణ్ణి చేసింది.

లంచ్ టైమ్‌లో పుస్తకాలు పట్టుకొని కాలేజీ నుంచి బయటకు వచ్చాను. పుస్తకాల్ని టీ బంకు వాడికిచ్చి అట్లా రోడ్డుపై నడుచుకుంటూ వెళ్ళడం ప్రారంభించాను. కోఠీ అనే సముద్రంలో కలిసిపోయి, కాస్త దూరం కొట్టుకు పోయి, మళ్ళీ అందులోంచి పక్కకు మరో సందువైపుకు నడిచాను. అబిడ్స్ దాటుకుంటూ, నాంపల్లి స్టేషన్ దాటుకుంటూ పబ్లిక్ గార్డెన్స్ వైపుకు వెళ్ళాను పచ్చపచ్చగా కళ్ళముందు కదలాడి కాస్త ఓదార్పు ఇచ్చింది పబ్లిక్ గార్డెన్స్.

ఆ సమయంలో పబ్లిక్ గార్డెన్‌ను చూడటం అదే మొదటిసారి. చాలామంది ఆవారా కుర్రవాళ్ళు న్యూస్ పేపర్లు పరచుకొని చెట్లక్రింద విశ్రమించారు. ఒక పది మంది జోరుగా పేకాట ఆడుతున్నారు. ఇంకో ఐదారుగురు స్టేషన్ వైపు నున్న గేటులోంచి వస్తున్నారు. భుజాలపై చొక్కాలు, చేతుల్లో ఆయుధాల్లా చీపురు కట్టలు, ఒక బెంచీపై కూలబడి చిల్లర డబ్బులు లెక్క వేసుకుంటున్నారు. ది స్ట్రీట్ చిల్డ్రన్ ఆఫ్ హైదరాబాద్. మొత్తం పార్కు అంతా అర్థగంటసేపు తిరిగి, అట్లాంటి పిల్లలు ఎంతమంది వుంటారా అని లెక్క పెట్టాను. యాభైపైగా తేలారు.

తల్లిదండ్రులు, ఇల్లులాంటి ఎలాచ్‌మెంటలేని వాళ్ళ జీవితం నాకో గొప్ప క్యూరియాసిటీ అయింది. శరీరాలు మురిగ్గా వున్నాయి. బట్టలు చిరిగిపోయి, మాసిపోయి చీదరికాన్ని చాటుతున్నాయి. దగ్గరకు వెళ్ళి, వాళ్ళతో మాట్లాడి, వాళ్ళతో కలిసిపోయి వాళ్ళ జీవితాల్ని గురించి వినాలని కోరిక కలిగింది. నా నాజూకు రూపం, ఖరీదైన బట్టలు నేనే వాళ్ళ మధ్య దిష్టిబొమ్మలా అనిపించాను. సాయంత్రానికి వాళ్ళలో ఇద్దరితో పరిచయం అయింది. వెంకటేషు, అర్జునరావు.





ఒకడిది ఒంగోలు. ఇంకొకడిది వైజాగు. ఒకడికి తల్లీదండ్రీ లేరు. ఇంకోడు తండ్రి రాక్షస హింసకు తట్టుకోలేక పారిపోయి వచ్చాడు. ఇద్దరూ కృష్ణా ఎక్స్‌ప్రెస్‌లో మధ్యాహ్నం దాకా షికారుచేసి భోగీలు ఊడ్చి పది దాకా సంపాదిస్తారట. అప్పుడప్పుడు బూట్ పాలిష్, కార్లు తుడవటం లాంటివి చేస్తుంటారు. రూపాయి యిచ్చి పొద్దున్నే సులభ్ కాంప్లెక్స్‌లో స్నానం చేస్తారు. రాత్రికింకో రూపాయి పడేస్తే రైల్వే స్టేషన్‌లో పడుకోవడం కుదురుతుంది.

సెంటిమెంట్లు, భయాలు, దిగుళ్ళులేని స్వేచ్ఛా జీవితం వాళ్ళది. నాకు వాళ్ళను చూస్తే బోలెడంత ఆశ్చర్యం, జెలసీ కలిగాయి. రెండు వందల నిమిషాల పరిచయం, కబుర్లు తరువాత ఎందుకో నాకు వాళ్ళతో వింత అనుబంధం, చనువు ఏర్పడ్డాయి అనిపించింది. "మా నాన్న జ్ఞాపకార్థం, ఇవాళ రాత్రికి మీ అందరికీ భోజనం నేను ఏర్పాటు చేయిస్తాను" అన్నాను అనాలోచితంగా. వాళ్ళు వింతగా చూసేరు. ఒకళ్ళిద్దరు కిసుక్కున నవ్వారు. వెంకటేష్ నిజమా అన్నట్టుగా చూశాడు. "ఎనిమిది గంటలకు వస్తాను. ఇక్కడే వుండండి. ఇంకా మీ ఫ్రెండ్స్‌ని కూడా పిలవండి!" అన్నాను ఇంటికి డబ్బులకోసం వెడుతూ వాళ్ళముఖాల్లో అపనమ్మకం.


రాత్రి ఎనిమిది గంటలకు మొదలైంది మా విందు. నా స్కాలర్‌షిప్ డబ్బు కాకుండా, నాన్న అప్పుడప్పుడూ ఇచ్చిన డబ్బులు, అన్నీ కలిసి వెయ్యి దాకా పోగయ్యాయి. వెళ్ళిపోయిన వాళ్లు వెళ్ళిపోగా, కొత్తవాళ్ళు కొంతమంది కలిసి నలభై మందిదాకా వున్నారు తింటే 'ఆల్ఫా'లో బిరియానే తినాలన్నారు. సరేనంటూ అందరం నంబరు 5 బస్సు ఎక్కాము. వెంకటేష్, ఇంకో ఇద్దరు కుర్రాళ్ళు 'ఆల్ఫా' కెళ్ళారు. బిరియానీ పొట్లాలు తేవడానికి మిగిలిన వాళ్ళం పెరేడ్ గ్రౌండ్ దగ్గర దిగాము.

సన్నని వెలుగు తుంపరలా వుంది పైన వెన్నెల. విశాలమైన మైదానం. క్రమంగా మా మధ్యన అంతరము తరిగిపోయి స్నేహ వాతావరణం ఏర్పడింది. వస్తూవస్తూ నా వెంట నాన్న ఫోటోలున్న ఆల్బమ్ తెచ్చాను. కనపడీ కనబడని ఆ వెలుతుర్లో వాళ్ళంతా ఉత్సాహంగా ఆ బొమ్మల్ని చూస్తున్నారు. ఒక వింత ఉద్వేగంతో ఆయన గురించిన కబుర్లు అన్నీ చెబుతున్నాను. మధ్య మధ్యలో వాళ్ళ అనుభవాల్ని వినిపిస్తూ, ఆ రాత్రి వేళ మైదానం కథాసాగరంలా మారిపోయింది.

ఫుట్‌బాల్ ఆటలో నాన్న విజయాల్ని చెప్తుంటే వాళ్ళు అచ్చెరువైనారు. వాళ్ళలో కాస్త వయసున్న కుర్రవాడు ఆనందన్ 'ఆయన పేరు నేను విన్నాను. చాలాయేళ్ళ క్రితం నేషనల్ టీమ్‌లో వున్నారు కదా!" అన్నాడు. ఇంక నా ఆనందానికి హద్దులే లేవు. పరవశ సముద్రం అయ్యాను. ఇంతలో 'ప్రకాష్‌గాడు వచ్చేలోపల మనం ఫుట్‌బాల్ ఆడుదాం రా!" అంటూ ఒక కుర్రాడు ప్రపోజ్ చేశాడు.

నిముషాల్లో అక్కడో కోర్టు తయారైంది. రెండు టీములుగా ఏర్పడ్డాము. ఇప్పుడే వస్తననటూ వెళ్ళిన ఆనందన్ ఐదు నిముషాల్లో బాల్ పట్టుకొచ్చాడు. ఎక్కడదని అడిగితే స్పోర్ట్ కౌన్సిల్ వాళ్ళ ఆఫీసువైపు చూపించి "ష్! గప్‌చుప్!" అంటూ తమాషాగా సైగ చేశాడు.

ఆవాల్టి ఫుట్‌బాల్ మ్యాచ్‌ని నేనెన్నటికీ మరిచిపోలేను. పైన వెన్నెల, ఆకాశం. అటూ ఇటూ దీపకాంతిలో మెరిసిపోయే నగరం, ప్రపంచమంతా అదృశ్యమై మేము మాత్రమే మిగిలిపోయినట్లుగా ఒక అసాధారణమైన క్రీడా సందర్భంగా మారిపోయాము. ఆనందన్ ఒక జట్టు. నాదొక జట్టు. బాగా లడ్డుగా వున్న కుర్రవాడు మా గోల్ కీపర్. వాడు బంతిపై అమాంతం పడిపోయి గోల్ చెయ్యనివ్వడం లేదు. ఫస్ట్‌హాఫ్ అయ్యేసరికి ఎవరికీ గోల్‌కాలేదు. రెండో హాఫ్‌లో నేను ఫార్వర్డ్ పొజీషన్‌కి వెళ్ళి ఒక పంచ్ యిచ్చాను. వాళ్ళ గోల్ కీపర్ తలపైనుండి అది గోల్‌లో కెళ్ళింది. మా జట్టు వాళ్ళంతా నన్ను భుజాలపై కెత్తుకొని ఊరేగించారు. రాత్రి పది దాకా ఆ అరుపులు, కేకల క్రీడోద్వేగం. ఒక విశృంఖలమైన మహానదిలా మైదానమంతా ప్రవహించాము.




బిరియానీ తినడానికి ముందు వాళ్ళలోంచి ఒక కుర్రవాడు లేచి "ఒరే! నాకు మంత్రాలు వచ్చురా!" అంటూ, మా నాన్న పేరుని అర్థంకాని మంత్రంతో జపించి "ఆయన ఆత్మకేం ఢోకాలేదు పో!" అంటూ, రెండు, మూడు బిరియానీ ముద్దల్ని దూరంగా గట్టుపై పెట్టాడు. మరపురాని విందు అది. స్పోర్ట్స్ కౌన్సిల్ ఆఫీసు పక్కనున్న పైపులోనుంచి నీళ్ళుతాగి మళ్ళీ అందరము మైదానంలోకి వచ్చాము. కాసేపటికి అక్కడో సంగీత సభ ప్రత్యక్షమైంది. ఒకడోపాటతో, ఇంకొకడో సినిమా డైలాగులతో, ఒకడు నాటక పద్యాలతో, ఇంకొకడు ప్రభుదేవా డాన్సులతో, ఆపైన శ్రోతల అరుపులు, కేకలతో అక్కడో స్వప్నకోలాహలం ప్రత్యక్షమైంది.

డమడమ శబ్దం చేసుకుంటూ రెండు జీపులు మైదానం దగ్గరకు వచ్చి ఆగిపోయాయి. వెంకటేష్ ముందుగా పసిగట్టాడు. "పోలీసులురా! పరిగెత్తండ్రా!" అంటూ అరుస్తూ పరుగు లంకించుకున్నాడు. మెరుపు వేగంతో వాడు మరో వైపు రోడ్డులో మాయమయ్యాడు గానీ, చాలా మంది పోలీసులకు దొరికిపోయారు. పెట్రోలింగ్ జీపులవి. కొద్దిగా చిన్న చితక వయసువున్న వాళ్ళను వదిలేసి, ఏపుగా పెద్దవాళ్ళలా కనిపిస్తున్న పాతిక మందిని వ్యాన్లలోకి ఎక్కించారు. అందరికీ ఇది అలవాటైన ప్రహసనంలా వుంది. అన్నీ దొంగ పేర్లే చెప్పారు. కంగారులో నేను నా అసలు పేరు, అమ్మ పేరు అడ్రసు చెప్పాను. పరిశీలనగా నా ముఖంలోకి చూశాడు ఇన్‌స్పెక్టర్.

ఆవిడొస్తుందేమో అని భయపడ్డాను. సీరియస్ లుక్, సుదీర్ఘమైన కొటేషన్ వాటిని తలచుకొని కొద్దిగా దిగులు పడ్డాను. కానీ ఆమె రాలేదు. పది గంటలకు మమ్మల్ని కోర్టుకు తీసుకెళ్ళారు ఇన్‌స్పెక్టర్. నాలుగు గంటలపాటు కోర్టు ఆవరణలో నిలబడే శిక్ష వేశాడు జడ్జి. కోర్టు ఆవరణలో నిలబడి వుండగా ప్రత్యక్షమైంది మాలతి మేడమ్ (మా అమ్మ.)
కోర్టు ఆవరణలో వున్న బడ్డీ కొట్టువాణ్ణి పిలిచి మా పాతిక మందికి టిఫిన్, కాఫీ ఏర్పాటుచేసింది. తన ముఖం మరీ సీరియస్‌గా లేదు. కానీ ఆ ముఖంపై గొప్ప అపనమ్మకం నాకు. క్షణాల్లో పెళపెళా రావాల ప్రళయంగా మారగలదా ముఖం.

మూడు గంటలకు మా శిక్షాకాలం అయిపోయింది. వెళ్ళిపోవచ్చు అన్నాడు ఇన్‌స్పెక్టర్. మిగిలిన నేస్తాలకు కళ్ళతో గుడ్‌బై చెప్పి ఆమె వెంట బయల్దేరాను. ఎప్పుడా ఎప్పుడా ఎదురు చూసిన తుఫాను రానే లేదు. రాత్రి పడుకునే టప్పుడు మాత్రం "నాతో కలసి వుండటము ఇష్టం లేకపోతే చెప్పు హాస్టల్‌లో చేర్పిస్తాను. నేను మీ నాన్నలా ఎప్పటికీ వుండలేను. ఒకొళ్ళకొకళ్ళు అట్లా అల్లుకుపోవటాలు, ప్రపంచపు బాధలు, దుఃఖాలతో మనకేం సంబంధం లేనట్లు, కేవలం మనమే అన్నట్లుగా వుండటము నాకు సాధ్యం కాదు. హఠాత్తుగా ఒక కల్పనా మూర్తిగా మారిపోయి, రొమాంటిక్‌గా నిన్ను లాలించటాలూ, బుజ్జగించటాలు నేను చెయ్యలేను" అంటూ ఓ పెద్ద లెక్చరిచ్చింది.

హఠాత్తుగా ఒక శూన్యంలా మారిపోయి, జ్ఞాపకాలన్నీ వలిచేసుకుని, నగ్నంగా, అశక్తంగా దేనికోసమో వెతుకుతున్నట్టుగా మారిపోవటం అలవాటయ్యింది నా మనసుకు. ఎంత ప్రయత్నించినా ఈ దైన్యంలోంచి వెనక్కురాలేక పోతున్నాను. నెలరోజుల్లో అంతా సర్దుకుంటుంది. ఆయన జ్ఞాపకం క్రమంగా మరుగై, మరో కొత్త అనుభూతి పోగుపడుతుంది అనుకున్నాను అట్లా జరగలేదు. లోపల శవం కుళ్ళుతూనేవుంది. క్లాసులో కూర్చో బుద్ధిపుట్టటం లేదు. క్లాసు మధ్యలో బయటకు వచ్చేయటం, తీరా బయటకు వస్తే, కాలేజంతా, గువ్వపిట్టల్ని లోపల ఇముడ్చుకున్న పంజరంలా, నేనొక్కణ్ణే పంజరానికి ఈవల వున్నట్లు, ఆ నిర్మానుష్యం నాకు నచ్చేది కాదు. జనంతో, వాహనాలతో హడావుడిగా వుండే రోడ్లు బాగున్నట్లు అనిపించేవి. అట్లా రోడ్లపై నడుస్తుంటే ఆ ప్రవాహంలో నా అస్తిత్వం కలిసిపోయి కొంతమేరకు ఓదార్పు కలిగేది. అబిడ్స్ సెంటర్‌లో ఆగి పేవ్‌మెంటుపై పరిచిన పుస్తకాల దగ్గర చాలా సేపు గడుపుతాను. పుస్తకాలు తిరగేస్తుంటే ఎక్కడో ఒక మూలన ఆవడిరాసిన పుస్తకం కనిపిస్తుంది. అంతటితో ఆ కాస్త కాలక్షేపం ముగుస్తుంది. ఒక ఆలోచన, వ్యథ వెంట తరుముతుంది. మా ఇద్దరి మధ్య నున్న అనుబంధం పేరేటిమి? అనే ప్రశ్న? పుడుతుంది. అందరూ

ఎంతగానో గ్లోరిఫై చేసే అమ్మతనం, అమ్మప్రేమ నా విషయంలో ఎందుకు చేదుపాటలా అయిపోయింది అనే ప్రశ్న దిగులు దిగులుగా వుడుతుంది. "ఇంకా అమ్మప్రేమ, నాన్న ప్రేమ, వంకాయ్! ఏమిట్రాయిది. కొద్దిగా ఎర్రగా, బుర్రగా వుండే పిల్లనొకదాన్ని చూసి దాన్తో సెటప్ చేసుకో!" క్లాసుమేటు సత్యం రోజూ విసుక్కుంటూ వుంటాడు. "ఈ రాజ్‌కపూర్ గెటప్‌లు, అక్కినేని మార్కు బాధే సౌఖ్యమనే భావనల కాలం గడిచిపోయింది. పబ్‌లు, డేటింగ్‌ల కాలం వచ్చింది. అరె భాయి! జర దేఖో ఛలో!" అంటూ వాడు జ్ఞాన బోధ చేస్తాడు. "ఓ రెండొందలు తీసుకురా! పబ్‌కి వెళదాం!" అంటూ చాలా రోజులు పోరేవాడు. ఎందుకో ధైర్యం. చెయ్యలేక పొయ్యాను. నిన్న మొన్నటి వరకూ సారా వ్యతిరేక ఉద్యమం తాలూకు మీటింగ్‌లన్నీ మా యింట్లోనే జరిగేవి. ఆ కరపత్రాలు, బ్యానర్లు మా యింట్లోనే తయారయేవి. ఆ యింట్లో మనిషిగా నాకో మోరల్ రెస్పాన్సిబులిటీ వుందనిపించేది. ఆబిడ్స్‌నుంచి అట్లాగే నడుచుకుంటూ నాంపల్లివైపు వస్తాను. ఏ ఇరానీ హోటల్లోనో దూరతాను. వేడి వేడి టీ పొగల మధ్య హోటల్లోకి వచ్చే గుంపును ఎంజాయ్‌చేస్తాను. ఆ ఉర్దూ పదాలు, వాటిని పలికేగొంతుల్లోని మొరటుదనం నాకెంతో బాగుంటుంది. చిన్న చిన్న కుర్రవాళ్ళు బల్లలు తుడుస్తూ, టీ కప్పులు తీస్తూ, వాళ్ళలో నా పోలికలు వెతుక్కుంటాను. వాళ్ళ కళ్ళలో దిగులు కథలు కదలాడతాయి. రెండు మూడు టీలు తాగి, ఎవరో అజ్ఞాత మిత్రుడికోసం ఎదురు చూస్తున్నట్టుగా రెండు గంటలు గడిపి, ఉర్దూ పదాల, టీ వాసనల చిత్తడిలోంచి బయటపడి మళ్ళీ రోడ్డుపైన ప్రయాణం చేస్తాను. పబ్లిక్ గార్డెన్స్‌లో అవేల్టి వెన్నెల విందు స్నేహితులెవరైనా కనిపిస్తారేమో అని వెతుకుతాను. అన్నీ కొత్త ముఖాలే. అప్పటికి సాయంత్రం అయిదు అవుతుంది. ఇంటివైపు వెళ్ళే బస్సును పట్టుకుని ఆవేల్టికి యాత్రని ముగిస్తాను.

చూస్తుండగానే క్లాసులు ఎగగొట్టడం, ఇట్లారోడ్ల వెంట తిరగటం నాకో వ్యసనంలా మారింది. అటెండెన్సు రిజిష్టరులో నా పేరు ఎదురుగా అన్నీ ఇంటూ మార్కులే. ఒక రోజు నాన్నకి తెలిసిన ఒక లెక్చరర్ క్లాసులో నన్ను నిలవేశాడు. ఇదేమిటి ఇన్ని ఇంటూ మార్కులని. "నాకు వంట్లో బాగుండటం లేదు. ఫిట్స్ వస్తున్నాయి. డాక్టరు దగ్గరకు వెళ్ళాల్సివస్తుంది" తటాలున నా నోటి వెంట అబద్ధం వచ్చింది. వెనుక నుండి సత్యంగాడు కిసుక్కున నవ్వాడు. ఆనవ్వు విచ్ఛిరవ్వలా క్లాసంతా పాకింది. ఆయనకు అర్థమైనట్లుంది. నేను మాత్రం బింకంగా వున్నాను. నిజంగా నిఝం అన్నట్టు పెట్టేను నా ముఖం.

సాయంకాలానికి ఆ మనిషి ఇంట్లో ప్రత్యక్షమయ్యాడు. మాలతి మేడమ్‌కు సానుభూతితోపాటు నా ప్రోగ్రెస్ షీటు కూడా అందించాడు. "పిల్లవాడికి ఆరోగ్యం బాగులేక పోవడం నిజమేనా?" అని అడిగాడు. "ఈ వయసులో ఫిట్స్ ఏమిటి?" అన్నాడు. ఆమె ఒక విస్ఫోటనమై నాపై విరుచుకు పడుతుందేమో అని భయపడ్డాను.

విస్ఫోటనం జరగలేదు. దిగులు మిళితమైన మృదు స్వరం బయటకు వచ్చింది. "వాడికి ఆరోగ్యం బాగాలేక పోవడం నిజం. ఫిట్స్ కాదుకానీ వాడి మనసుకు జబ్బు చేసింది. ఇంగ్లీషులో 'గ్రీఫ్' అంటామే అది వాడి జబ్బు. వాళ్ళనాన్న మరణం వాణ్ణి కుదిపివేసింది. దుఃఖానికి మందు దుఃఖ పడనివ్వడమే అని నేనూ వాణ్ణి డిస్టర్బ్ చేయడం లేదు. క్రమంగా వాడే కోలుకుంటాడు. మళ్ళీ జీవితంలోకి వస్తాడు" ప్రవక్త కంఠస్వరంతో ఆమె చెబుతూ వుంటే అది వ్యంగ్యమో, నిజమో కాసేపు అర్థం కాలేదు.

గత పదహారు 'జనవరి ఎనిమిది'లకు, ఈసారి 'జనవరి ఎనిమిదికీ పోలికే లేదు. జనవరి ఎనిమిది నాన్న బర్త్‌డే. నాలుగింటికే నిద్రలేచి, పనిమనిషితో చెప్పి ఇంటిముందు హేపీ బర్త్‌డే ముగ్గు వేయించి, ఇంటి ముందున్న జామి చెట్టు గుబుర్లలో పూలపొట్లం వేలాడదీసి పేపర్ చదువుకుంటూ కాఫీ సిప్ చేస్తూ ఆయన ముంగిట్లోకి వచ్చి బర్త్‌డే ముగ్గుచూసి అచ్చెరువొందుతున్న క్షణాల్లోనే చెట్టుపై నుండి జలజలా పూలు రాలి, టేప రికార్డర్ లోంచి వేణుగాన జలపాతం జాలువారుతుండగా 'హేపీ బర్త్‌డే డాడీ!' అంటూ ఆయనను అభినందించే ఆ జనవరి ఎనిమిది మరింకెప్పటికీ రాదు.

ఇవాళా నాలుగింటికే లేచాను. వాకిట్లో కూలబడ్డాను. ఆకాశంలో చందమామ లేదు. నక్షత్రాలు లేవు. చలి, చీకటి, గేటు కవతల దెయ్యపుకన్నులా ట్యూబులైటు, మెల్లగా రగులుకుంటున్న శబ్దాలు, దగ్గుతూ, మూలుగుతూ వణుకుతూ పనులకు వెళ్ళేవాళ్ళు, అంత చలిలో 'ఛాయ్! ఛాయ్!' అనుకుంటూ వెళ్ళే ముసలి టీ వాలా. వాణ్ణి పిలిచి కప్పడు టీ అందుకున్నాను. సువాసనా, రుచి కోల్పోయిన వేడి పదార్థం. రెండు పాలపాకెట్లను మెట్లపై విడిచి వెళ్ళేడు పాలతాత. పట్‌మంటూ లోపలికి చుట్ట చుట్టిన పేపర్‌ను విసిరాడు పేపర్ బాయ్. తలపైనుండి భుజాలదాకా ఒక పాత చీరచుట్టుకుని వచ్చింది పనిమనిషి, పేపర్ నా వైపుకు విసిరి చీపురుతో పరపరమంటూ ఊడవటం మొదలు పెట్టింది. "ముగ్గులు, అలంకరణలు లాంటి వేమీ వద్దు ఇవాళ" అన్నాను హఠాత్తుగా. క్షణంపాటు నావైపు జాలిగా చూసి మళ్ళీ తన ఊడ్చే కార్యక్రమంలోకి వెళ్ళిపోయింది. పేపరు చేతిలోకి. తీసుకుని విప్పి, అట్లా హెడ్‌లైన్స్ చూస్తుండగా, మొదటిపేజీలో ఒక మూలన ఆమె ఫోటో కనిపించి షాక్ తిన్నాను. సుప్రసిద్ధ నవలా రచయిత్రి, కవయిత్రి మాలతికి సాహిత్య అకాడమీ అవార్డు అంటూ వార్త. ఆ వార్తకు ఎలా స్పందించాలో అర్థంకాలేదు. పేపరునలా ముందుగదిలోకి విసిరి, చాప, దిండు తీసుకుని మేడపైకి వెళ్ళాను. నిద్రో, మగతో, దిగులో, నీరసమో తెలియనట్లుగా అట్లాగే పడుకున్నాను. ఉదయం ఎనిమిది గంటలదాకా.

పూలహారాలు, ఫోటో ఫ్లాష్‌లు, ఒకటొకటిగా పేర్చుకుపోతున్న జ్ఞాపకాల చప్పుళ్ళు, కబుర్లు, వాటిని చీల్చుకుంటూ ఒక్కసారిగా హహ్హహ్హా అంటూ నవ్వులు – ఆ కోలాహలం విసుగ్గా, అనీజీగా అనిపించింది. ఇంట్లోకి వెళ్ళకుండా మాసినబట్టలతో అట్లాగే రోడ్డుపైకి వెళ్ళాను. వీథి కుళాయి దగ్గర ఆగి, కొద్దిగా నీళ్ళు ముఖంపై చల్లుకుని, చెదిరిన జుట్టును దువ్వుకొని నంబరు ఏడు బస్సు ఎక్కి మోండా మార్కెట్ వైపు వెళ్ళాను. మల్లెలు, సన్నజాజులు కనకాంబరాలు, చేమంతులు, గులాబీలు, ఒక్కో రకానికి ఒక దండ చేయించి హారాలన్నీ కారీ బాగ్‌లో వేసుకుని 'సిమెట్రీ'వైపుకు వెళ్ళాను. ఆ పూల హారాలన్నీ సమాధిపై కప్పి ఒక దుఃఖపుపొంగు బయటకు ఎగిసి రాగా పెనురోదనగా మారిపోయి అట్లా ఎన్ని గంటలసేపు గడిపానో నాకే తెలియదు.

మధ్యాహ్నం రెండు గంటలకు ఇంటికి చేరాను. ఆమె లేదు. తలుపు తెరిస్తే ఘాటయిన పరిమళమేదో గుప్పుమంది. పూలదండల పరిమళం. బహుశా పొగడ్తల పరిమళం, అతిశయపు పరిమళం కూడా అయ్యుంటుంది. టేబుల్‌పై మెసేజ్ "సాయంత్రం ఆరుకు రెడ్ క్రాస్ సొసైటీ ఆడిటోరియంకు రాకూడదూ!" అని.

"వెళ్ళకూడదు! వెళ్ళకూడదుగాక వెళ్ళకూడదు!" అని తీర్మానించుకొన్నాను. ఇల్లాంతా ఇట్లా పండుగ వాతావరణంతో వుండటము కూడా నాకు ఇష్టంగా లేదు. ఆపూల హారాలు, బోకేలు, గ్రీటింగులు అన్నింటినీ ఒక దుప్పటిలో మూటకట్టి స్టోర్ రూమ్‌లో విసిరి వేశాను. అవన్నీ తీసివేసినా పరిమళం మాత్రం వదిలిపోలేదు. రెండు చెంబులు నీళ్ళుతాగి, నా గదిలోకి వెళ్ళి తలుపు మూసుకున్నాను.

రాత్రి పది గంటలవేళ ఇంట్లో మళ్ళీ శబ్దాలు రాజుకున్నాయి. కార్లు, వెళ్ళిపోతున్న చప్పుళ్ళు. వీడ్కోలు చప్పుళ్ళు. ఇల్లంతా కలదిరుగుతున్న ఆమెపాదాల చప్పుడు. గాలిలో మళ్ళీ పరిమళాలు విప్పుకొన్నాయి. ఆ పరిమళం లోంచి ఉల్లాసం, ఆనందం వెల్లి విరిసి ఇల్లంతా పాకినట్లనిపించింది. నాకు అసహ్యంగా, భరింపరానిదిగా తోచిందా పరిమళం.

మృదువైన తన పాదాల చప్పుళ్ళు, నా మంచం దగ్గరగా వినిపించాయి. మెలకువగా వున్నా నిద్ర నటిస్తున్నాను. నా నుదుటిపై చెయ్యివేసి, జ్వరం లాంటిదేమీలేదని



నిర్ధారించుకుని, పలచటి దుప్పటిని నాపై కప్పి - ఒక నిముషం పాటు అక్కడ నిశ్శబ్దం. ఆ నిశ్శబ్దపు క్షణాల్లో ఆమె ముఖంలో ఏయే భావాలు కదలాడి వుంటాయో అని ఆలోచించుకుంటూ అట్లాగే నిద్రలోకి జారిపోయాను.

ఆరు గంటల ఉదయం. ఆకలి ఆకలిగా, నీరసంగా వున్నాను. నిన్నంతా తిండిలేదు. ఆమెను లేపి కాఫీ అయినా ఇవ్వమని అడుగుదామనిపించింది. బహుశా సన్మానం తాలూకు సుఖ నిద్రలో వుండి వుంటుంది. డిస్టర్బ్ చెయ్యడం ఎందుకు, నేనే చేసుకుంటే పోలా అనిపించింది. బయట వరండాలో పాలపాకెట్టు, పక్కనే పేపరు పడివున్నాయి. పాలపేకట్టు అందుకుంటూనే, అట్లాగే పేపరు చేతిలోకి తీసుకొన్నాను.

మొదటిపేజీలో వార్త చూసి షాక్ అయ్యాను. సుప్రసిద్ధ రచయిత్రి మాలతికి తీవ్రమైన గాయాలు. అశ్లీల సాహిత్యానికి వ్యతిరేకంగా జరుపుతున్న ఊరేగింపుపై పోలీసుల లాఠీ ఛార్జీ. గుండెల్లో ఏదో కలుక్కుమన్నట్లనిపించింది. పక్కనే మరో వార్త. "హైదరాబాద్ స్ట్రీట్ చిల్డ్రన్‌కు రచయిత్రి మాలతి కానుక" "చనిపోయిన తన భర్త జ్ఞాపకార్థం రాజశేఖర్ మెమోరియల్ ఇన్‌స్టిట్యూట్ ఫర్ స్ట్రీట్ చిల్డ్రన్ అనే సంస్థను రెడ్‌క్రాస్ సంస్థ సహకారంతో ఏర్పాటు చేశారు రచయిత్రి మాలతి. సాహిత్య అకాడమీ బహుమతి మొత్తంతోపాటు తన రచనలపై వచ్చే రాయల్టీని కూడా ఈ సంస్థకే వినియోగించనున్నట్టు...."

పేపరును అట్లాగే విసిరేసి ఆత్రుతతో ఆమె గదిలోకి వెళ్ళాను. నిద్రలో వున్నట్లు వుంది. తలపై పెద్ద బాండేజి. చేతికి కూడా కట్టువుంది. మంచంపై ఒక మూలకు వత్తిగిలి, పసిపాపలా ముడుచుకుని పడుకొంది. అలలా ఒక దుఃఖపు ఫొంగునన్ను చుట్టుముట్టింది. రాత్రంతా ఈ దెబ్బల బాధతో ఒక్కతే మూలుగుతూ అట్లాగే గడిపి వుంటుంది. ఒక కప్పుకాఫీ, చిన్న సపర్య, కనీసం రవంత సానుభూతీ - ఏదీ చెయ్యలేక పోయానే? ప్రపంచపు దుఃఖమంతా తమ దుఃఖమనుకొని, ఇట్లా దెబ్బలుతిని, జైళ్ళలోపడి, ఆఖరికి ప్రాణాలు కూడా పోగొట్టుకునే త్యాగమూర్తులకోవలోకి చెందిన మాలతీ మేడమ్! ఇవాళ ఎందుకో నీ దగ్గరకు చేరి, నీ స్పర్శలో కలిసిపోయి, సినిమాటిక్‌గా నిన్ను అమ్మా అని పిలిచి, డామిట్! నా కళ్ళనిండా యిట్లా నీళ్ళు సుడులు తిరుగుతుండటమేమిటి? ఈ కళ్ళ నీళ్ళు కార్చడాలు, అవీ ఆమెకు బొత్తిగా ఇష్టం వుండదు. కళ్ళు తుడుచుకొని, వంటగదిలోకి వెళ్ళి హడావుడిగా కాఫీ చేసుకుని, కాఫీ కప్పుతోసహా ఆమె గదిలోకి వెళ్ళాను. అప్పడే నిద్రలేచిన ఆమె నా వైపు ఆశ్చర్యంగా, అపనమ్మకంగా చూస్తుంది.

★

## కడసారిగా మోసుకొస్తున్నాం

బుతువులు తీతువులైన
భూమి మా దేహం

మా వంటి మీద పగలని పత్తికాయలు
మా కంటి తడి మీద నించి
ఎగిరిపోతున్న పచ్చని శాలువాలు

అనాదిగా మీ అరచేతి తీర్థంలో
శవాలమై తేలినా
నేల తల్లి సాక్షిగా
ఎన్నో ధాన్య సముద్రాలు ఈదిన
గజ ఈతగాళ్ళం మేం

మా వెన్నెముకల మీద
బండరాళ్ళతో బతుకులు లిఖించినా
పాయలు పాయలుగా ప్రవహిస్తున్న
పెన్నేటి పుట్టుక మాది
మెదపలేని మా బండ నాలికల కింద
గుండె లోతు బాధ
మౌనంగా సమాధి అయిన
గిట్టెలు లేని మా మనస్సులు
లేచి వాడాలు కొట్టుకొని నడచినయ్
ఎవడి తలలో ఖండ ఖండాలైన మా
జాతి రెక్కలు
పుట్టుకొస్తున్నవి మండలు మండలుగా
ఇప్పడు వాడి కళ్ళలోకి జిల్లేళ్ళయి

శరతరాల సమ్మెట దెబ్బలకు
అంతరాంతరాల్లో పగిలిన మేము
మోసుకొస్తున్నాం కడసారిగా మీకు
తోలు తిత్తుల్లో తులసి నీళ్ళు.

- ఎం. వెంకట్


# ఇంధనం పొదుపు మనందరి బాధ్యత.

## సౌరశక్తిని ఉపయోగించండి. మన గ్రామాలలో కాలుష్యం పారద్రోలండి.

సోలార్ కుక్కర్ వాడండి. ఇంధనం ఆదాచేయండి.
కుటుంబానికి ఆర్థికంగా ఆరోగ్యపరంగా లాభం చేకూర్చండి.



ఇంధనం లేకుండా వంటకు
ఇండ్లలో, వీధులలో దీపాలకు
సౌరశక్తి చక్కని సాధనం

ఆంధ్రప్రదేశ్ సంప్రదాయేతర ఇంధన వనరుల అభివృద్ధి సంస్థ (NEDCAP)
(రాష్ట్ర ప్రభుత్వయాజమాన్య సంస్థ)
5-8-207/2, పిస్గా కాంప్లెక్స్, నాంపల్లి, హైదరాబాద్ - 500 001. ఫోను : 201651, 202391, 203692 గ్రామ్స్ : 'నెడ్‌క్యాప్'.

## సౌరశక్తి మార్గం సుఖజీవన మూలం

★ మరిన్ని వివరాలకు జిల్లా కలెక్టరు కార్యాలయములోకాని, నెడ్‌క్యాప్ జిల్లా కార్యాలయంనందుకాని సంప్రదించండి.